క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



కొత్తకోట రూరల్: ఆదర్శ పాఠశాలలో అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు భోజన సమయంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలలు నెలకొల్పి 12ఏళ్లు కావస్తున్నా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. తక్షణమే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, రెండో దశలో నియామకం అయిన ఉపాధ్యాయులకు నేషనల్ సర్వీస్ కల్పించాలని డిమాండ్ చేశారు.

సెల్‌ఫోన్లు అప్పగింత



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని మెంటెపల్లికి చెందిన మంద అరుణ్, నాగవరం గ్రామానికి చెందిన బాలపీర్, శ్రీనివాసపూర్‌కు చెందిన బాల్‌రాజు సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నామని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ల ఆచూకీని గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకొని బాధితులకు గురువారం అప్పగించామని వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో 34 ఫోన్లు పోయాయని ఫిర్యాదులు అందగా.. వాటిలో 8 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించామన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రానికి చెందిన నాగిరెడ్డి కొంతకాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కారుపాకుల వెంకట్రాములు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన రూ.2.50లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఎల్‌ఓసీ కాపీని గురువారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో కారుపాకు వెంకట్రాముయాదవ్, గుర్రంగడ్డ రాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతు



అమరచింత: మండలంలో బుధవారం, గురువారం మిషన్ భగీరథ నీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. మండలంలోని సింగంపేట గేట్ సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో మరమ్మతుల కోసం నీటి సరఫరాను నిలిపివేశారు. గ్రామాల్లో సోర్స్ బోర్లు, చేతి పంపులు లేకపోవడంతో తాగునీటి కోసం తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఎర్రగట్టు సమీపంలోని ప్రధాన పంప్‌హౌజ్‌కు విద్యుత్ అంతరాయం ద్వారా నీటి పంపింగ్ జరగడంతో అమరచింత, ఆత్మకూర్ మండలాల గ్రామాలకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేకపోతున్నారు. మిషన్ భగీరథ సిబ్బంది ద్వారా గురువారం పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపట్టినట్లు ఏఈ రామకృష్ణ తెలిపారు.

హైమాస్ట్ లైట్లకు..



అమరచింత: పట్టణంలోని రాజీవ్ కూడలిలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలగకపోవడంతో పరిసరాలు అంధకారం ఏర్పడింది. మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం పట్టణంలో ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు కోసం ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టర్ ద్వారా హైమాస్ట్ లైట్లను తెప్పించి తమ సిబ్బంది ద్వారా వాటిని అమర్చారు. పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు వార్డుల్లో విద్యుత్ స్తంభాలకు ఎల్‌ఈడీ బల్బులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి

పెబ్బేరు రూరల్: మండలంలోని తిప్పాయిపల్లిలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన గోపాల్‌రెడ్డి శ్రీరంగాపురం మండలానికి బదిలీపై అయ్యారు. దీంతో గోపాల్‌రెడ్డితో పాటు నూతనంగా గ్రామానికి వచ్చిన కార్యదర్శి ఖలీద్‌ను గురువారం గ్రామస్తులు శాలువా, పూలమాలతో సన్మానించారు.

మహిళలను అవమానించడం తగదు



కొత్తకోట చౌరస్తాలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

ఆత్మకూర్: సీఎం రేవంత్‌రెడ్డి అధికార దర్పంతో మహిళా ఎమ్మెల్యేలను నోటికొచ్చినట్టు మాట్లాడుతూ అవమానపరుస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. గురువారం ఆత్మకూర్‌లోని గాంధీచౌక్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బంగారు శ్రీనివాసులు, కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, వీరేషలింగం, రియాజ్ అలీ, రవీందర్, రాజ్‌కిరణ్, జాంగీర్, కొత్తబోయ శేఖర్, జానకిరాములు, సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: అసెంబ్లీలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని అవమానిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం సరికాదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం కొత్తకోట చౌరస్తాలో బీఆర్‌ఎస్ శ్రేణులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం, డిప్యూటీ సీఎంలు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ విద్యార్థి, యువజన నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

అమరచింత: సీఎం రేవంత్‌రెడ్డి శాసన సభ సమావేశాల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలను అవమానించడం తగదని బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహులుగౌడ్ అన్నారు. బీఆర్‌ఎస్ జెండా కట్టవద్ద గురువారం సీఎం రేవంత్‌రెడ్డి తీరును వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో అబ్రహం, బాలరాజ్, జగన్నాథం, విజయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళా ఎమ్మెల్యేలను అవమానించే విధంగా శాసనసభలో మాట్లాడటం తగదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ సామ్యానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై బీఆర్‌ఎస్ నాయకులు బైఠాయించి తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో గోపాల్, అంజనేయులుగౌడ్, రాఘవేందర్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, వెంకటేష్, బాల్‌రెడ్డి, మన్యంగౌడ్, బుచ్చిబాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో..



ఖిల్లాఘనపురం బస్టాండు వద్ద..



ఆత్మకూర్‌లో..

‘ఖిల్లా’కు చేరని కేఎల్ఐ నీరు

ఖిల్లాఘనపురం: పెద్దకొత్తపల్లి మండలంలోని గుడిపల్లి రిజర్వాయర్ నుంచి కేఎల్‌ఐ కాల్వలకు మంత్రులు, ఎమ్మెల్యేలు అట్టహాసంగా సాగునీటిని వదిలి 10 రోజులు కావస్తున్నా ఖిల్లాఘనపురం మండలంలోని చాలా చెరువులకు నీరు చేరలేదని మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య అన్నారు. గురువారం వారు మంగనూరు నుంచి వచ్చే కమాలోద్దీన్‌పూర్ బ్రాంచ్ కెనాల్, ఖిల్లాఘనపురం బ్రాంచ్‌కెనాల్‌ను పరిశీలించారు. సాగునీరు అందించే కాల్వల్లో అడ్డుగా పెద్ద రాళ్లు, కంపచెట్లు ఉండటంతో అక్కడి నుంచి నాగర్‌కర్నూల్ ఇరిగేషన్ ఈఈ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి ఫోన్‌లో మాట్లాడి పరిస్థితులను వివరించారు. అనంతరం అక్కడే విలేకర్లతో మాట్లాడుతూ.. శ్రీశైలం ప్రాజెక్టు నిండి నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నప్పటికీ కేఎల్‌ఐకి సాగునీటిని ఎందుకు తరలించడం లేదని ప్రశ్నించారు. కేవలం ఒక్క మోటారు సాయంతో కాల్వలకు నీటిని ఎత్తిపోస్తున్నారని, ప్రాజెక్టుల్లో నీళ్లు పుష్కలంగా ఉన్నందున మరో మోటార్ ప్రారంభించాలని కోరారు. ప్రస్తుతం రైతులు వరి నాట్లు వేసుకునే సమయం దాటిపోతుందని, ఎమ్మెల్యే, అధికారులు స్పందించి కాల్వలకు నీటిని వదలాలని కోరారు. లేకుంటే మండల రైతులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు గొడుగు సత్యం, బుచ్చిబాబుగౌడు, మణ్యంగౌడ్, క్యామ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కాల్వలో అడ్డుగా ఉన్న రాళ్లను చూపుతున్న నాయకులు, రైతులు

పాన్‌గల్ పంచాయతీ కార్యదర్శి బదిలీ

పాన్‌గల్: మండల కేంద్రం పాన్‌గల్‌లో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రఘు సాధారణ బదిలీల్లో భాగంగా మదనాపురం మండల కేంద్రానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వీపనగండ్ల మండల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న నరేష్‌గౌడ్ బదిలీపై పాన్‌గల్‌కు వచ్చారు. మండల స్థాయి అధికారుల తోడ్పాటు, ప్రజల సహకారంతో అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

కొత్తకోట తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు



కొత్తకోట రూరల్: స్థానిక తహసీల్దార్‌గా ఎం.వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు చేపట్టారు. జోగులాంబ గద్వాల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఆయన సాధారణ బదిలీలో భాగంగా కొత్తకోటకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న బాల్‌రెడ్డి కొంతకాలంగా సెలవుల్లో వెళ్లడంతో డిప్యూటీ తహసీల్దార్ ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించారు. వెంకటేశ్వర్లు గతంలో 2021 మార్చి 3 నుంచి 2022 జనవరి 10వరకు ఇక్కడే విధులు నిర్వహించారు. జీఓ నంబర్ 317లో భాగంగా మెదక్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. అక్కడి నుంచి జోగులాంబ గద్వాల జిల్లాకు వచ్చారు. అనంతరం మళ్లీ కొత్తకోటకు తహసీల్దార్‌గా రావడంతో మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అతిథి గృహాన్ని పునరుద్ధరించాలి



ఈఈ కి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే జయరాములు అతిథి గృహాన్ని పునరుద్ధరించాలని అఖిల పక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం వనపర్తి పట్టణంలోని అతిథి గృహం పంచాయతీ రాజ్ ఎస్‌ఈ కార్యాలయంలో ఈఈ మల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంగా ఉన్నప్పుడు స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే జయరాములు స్మారకార్థం నిర్మించిన పంచాయతీ రాజ్ అతిథి గృహాన్ని జిల్లాల పునర్విభజనలో భాగంగా కలెక్టర్ నివాస భవనంగా మార్చారు. సమీకృత జిల్లా కార్యాలయాల నిర్మాణంలో భాగంగా కలెక్టర్‌కు కొత్త భవనం నిర్మించడంతో ఖాళీ అయిన బంగ్లాను అతిథి గృహానికి కేటాయించకుండా పంచాయతీ రాజ్ ఎస్‌ఈ కార్యాలయంగా మార్చడం తగదన్నారు. కార్యక్రమంలో కోళ్ల శంకర్, యాదయ్య, సతీష్, శివకుమార్, రాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు



ఆత్మకూర్: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపు చేయొచ్చని సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ అన్నారు. మండలంలోని ఆరేపల్లిలో పోలీసుల పిలుపు మేరకు గ్రామస్తులు ఏకమై సీసీ కెమెరాల ఏర్పాటు కోసం రూ.1.6లక్షలు పోగు చేశారు. ఈ సందర్భంగా సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్‌లు చెరో రూ.5వేల చొప్పున విరాళంగా గురువారం గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ లక్ష్మీకాంత్‌రెడ్డి, కోటేష్, లక్ష్మణ్, శ్రీను, ఆనంద్, తిరుపతన్న, దేవన్న, బాలస్వామి, గోవర్ధన్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సమస్యల గుర్తింపునకు ఇంటింటి సర్వే

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించేందుకు గిరిజన సంఘం, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించే సర్వేలో భాగంగా గురువారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో సర్వే బృందం పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ మాట్లాడుతూ తండాలో 150 కుటుంబాలను సర్వే చేయగా.. తాగునీరు, విద్యుత్, కాలనీలల్లో స్తంభాలు పాతినా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం మరిచారని, డ్రెయినేజీలు, సీసీ రోడ్లు, పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, ఎస్టీ కార్పొరేషన్ రుణాల పెండింగ్ వంటి సమస్యలు ప్రధానంగా గిరిజనులు ప్రస్తావించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఈనెల 10వ తేదీ వరకు సర్వే నిర్వహించి పూర్తి నివేదికను అధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు ఆనంద్‌కుమార్, మహిళ సంఘం నాయకురాలు చిట్టెమ్మ, రవినాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై ఆరా తీస్తున్న నాయకులు

ఆరు గ్యారంటీల అమలులో జాప్యం తగదు

అమరచింత: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆపార్టీ నాయకులు మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించినందునే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలన్నారు. రేషన్ కార్డులు లేక పదేళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అర్హులకు రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తాహసీల్దార్ చాంద్‌పాషాకు అందించారు. కార్యక్రమంలో రాజు, రాజన్న, సామేలు, కురుమన్న, అంజి, భక్తరాజ్, మురళి, శ్రీను, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఐఎంఎల్ డివిజన్ కార్యదర్శి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణ కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించారు.



పక్కాగా పంట వివరాల నమోదు

పెబ్బేరు రూరల్: వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులతో మాట్లాడి పంట వివరాల నమోదు చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి సూచించారు. గురువారం ఆయన అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్‌తో కలిసి మండలంలోని కంచిరావుపల్లి శివారులో పంట వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించి, తగు సూచనలు చేశారు. అనంతరం కంచిరావుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో ఒకే మూత్రశాల ఉందని ప్రధానోపాధ్యాయుడు కలెక్టర్‌కు వివరించారు. మన ఊరు మన బడి కార్యక్రమానికి పాఠశాల ఎంపికైన పూర్తి స్థాయిలో పనులు జరగలేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ మరుగుదొడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈని ఆదేశించారు. గ్రామంలోని హరిజన్ వాడ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లేదని, అసంపూర్తి పనులు చేసి పూర్తయినట్లు తప్పుడు నివేదిక ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రంగనాథుడికి ప్రత్యేక పూజలు

శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగనాయకస్వామి ఆలయాన్ని దర్శించి శ్రీదేవి భూదేవి రంగనాయక స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సాంప్రదాయ ప్రకారం పూజారులు పూర్ణకుంభం, మేళతాళాలతో కలెక్టర్‌కు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి, స్వామివారి శేష వస్త్రాలతో ఆశీర్వచనం పలికారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్ ఆలయ విశేషాలు వివరిస్తూ.. శ్రీరంగాపూర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. చిన్నారులకు తల్లిపాలే శ్రేష్ఠమైనవని, పిల్లలకు తల్లిపాలు పట్టించడం ద్వారా రోగ నిరోధకశక్తి పెరుగుతుందని గర్భిణులు, బాలింతలకు సూచించారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై వైద్యులతో చర్చించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ జయచంద్రమోహన్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, ఆఫీసర్ పరిమళ, తహసీల్దార్లు లక్ష్మి, మురళి, ఎంపీడీఓ రవీంద్ర, డీఈ శ్రీనివాస్, ఎంఈఓ జయరాములు తదితరులు పాల్గొన్నారు.



పంటల నమోదుపై ఆరా తీస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వర్గీకరణపై ‘సుప్రీం’ తీర్పు హర్షణీయం



అమరచింతలో మిఠాయిలు తినిపించుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అమరచింత: సుప్రీం కోర్టు మాదిగల ఏ, బీ, సీ, డీ వర్గీకరణపై తీర్పు ఇవ్వడంపై పట్టణంలో గురువారం ఎమ్మార్పీఎస్ పిలుపు మేరకు స్థానిక బాణాసంచా కాల్చి మిఠాయిలను పంచిపెడుతూ సంబురాలు చేసుకున్నారు. ఈమేరకు ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.విజయ్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా మాదిగలు ఏ, బీ, సీ, డీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టి చట్టబద్ధత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సింగిరెడ్డి పరమేష్, చంద్రన్, డీసీ రాజశేఖర్, ధర్మాపురం కుర్మన్న, శివన్న, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేసిన సుదీర్ఘ పోరాటానికి ఫలితం దక్కిందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఎర్రం చంద్రయ్య, కుర్మయ్య, సిద్దు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణకు ఆమోదం తెలుపడంతోనే సుప్రీంకోర్టు తీర్పు కూడా అనుకూలంగా వచ్చిందని వారు పేర్కొన్నారు.

కొత్తకోట: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై ఏళ్లుగా మందకృష్ణ మాదిగ చేస్తున్న పోరాటం నేటికి ఫలించిందని ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు జేఎం మిషేక్ అన్నారు. గురువారం సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎమ్మార్పీఎస్ అధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మిషేక్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైన ఎస్సీలకు తాజా తీర్పు ఉపశమనం కలిగించిదన్నారు. కార్యక్రమంలో సుజ్ఞానం, రత్నం, జయరాజు, సాయిలు, కుర్మయ్య, లక్ష్మణ్, ధనుష్, రమేష్, రాజు, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.



కొత్తకోటలో మాట్లాడుతున్న జేఎం మిషేక్

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం చేస్తున్న పోరాటం నేటికీ ఫలించిందని హర్షం వ్యక్తం చేశారు.

వినియోగదారుల హక్కుల రక్షణకు కృషి

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్ గ్రామ వాసి వినియోగదారుల ఫోరం జిల్లా చైర్‌పర్సన్‌గా నియమితులై తొలిసారిగా గ్రామానికి వచ్చిన మౌనిక యాదవ్‌ను గురువారం గ్రామస్తులు పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని, హక్కుల గురించి వివరించడంతో పాటు వారు నష్టపోకుండా చూస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి కృషి చేశారని, జిల్లా చైర్‌పర్సన్‌గా మంచి సేవలు అందిస్తూ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ లలిత, తిరుపతయ్య, రవి, తిరుపతి యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



మౌనికయాదవ్ దంపతులను సన్మానిస్తున్న శాగాపూర్ గ్రామస్తులు

విద్యార్థికి సన్మానం

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల ఆదర్శ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న భాస్కర్ జపాన్‌లో జరిగే ‘సకుర సైన్స్’ ప్రదర్శనకు ఎంపికయ్యాడని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌చారి తెలిపారు. భాస్కర్ నవంబర్ 10 నుంచి 16వరకు జపాన్ వెళ్తున్నాడని తెలిపారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థి జపాన్ పర్యటనకు వెళ్లడం సంతోషంగా ఉందంటూ గురువారం ఉపాధ్యాయ బృందం విద్యార్థి భాస్కర్‌ను పూలబొకేను ఇచ్చి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తూర్పింటి నరేష్ కుమార్, నాగరాజు, చిన్నగోపాల్, చిన్నయ్య, మంగమ్మ, రాఘవేంద్రశర్మ, సంజీవ్‌కుమార్, రాఘవేందర్, చిన్నరాములు, సరిత, ఉస్మాన్, చంద్రశేఖర్, ఖదీర్, సల్మాబేగం, హేమలత, వకుళమాలిక, లక్ష్మీకళ, రాకేష్, మహేశ్వరి, ఆంజనేయులు, స్వాతి, రాధిక, శారద తదితరులు ఉన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

‘ప్రభుత్వాన్ని నిందించడం మానుకోవాలి’

పెబ్బేరు రూరల్: మండలంలోని పాతపల్లి, గుమ్మడం గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పరిశీలించి, ఇంకా నిర్మాణ పనులు పూర్తి కాలేదని ప్రభుత్వాన్ని నిందించడం తగదని కాంగ్రెస్ నాయకులు దుయ్యబట్టారు. గురువారం పట్టణ కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనులు పూర్తి చేయకుండా.. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు సురేందర్‌గౌడ్, రంజిత్‌కుమార్, దయాకర్‌రెడ్డి, రవీందర్‌నాయుడు, రాములుయాదవ్, రాములు, రంగన్నయాదవ్, రాములు, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దండి



అమరచింత: మక్తల్ నియోజకవర్గానికి అభివృద్ధిలో ప్రాధాన్యత ఇచ్చి జూరాల ప్రాజెక్టు, చంద్రగఢ్ కోటను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, తులసీరాజ్, వెంకటేశ్వర్‌రెడ్డి, మహ్మద్‌కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

సాక్షి, నెట్‌వర్క్: అప్పుడే పుట్టిన చిన్నారులకు తల్లిపాలు పట్టించడం ద్వారా బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడని డాక్టర్ నిఖిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాహీన్‌బేగం అన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నర్మద, ఏఎన్‌ఎం శారద, అంగన్‌వాడీ టీచర్లు నాగేంద్రమ్మ, రాధిక, బాలేశ్వరి, సుగుణాబాయి, మహేశ్వరి, ఆశా కార్యకర్త రాధ తదితరులు పాల్గొన్నారు.



పుర కార్మికుల ఆందోళన



మాట్లాడుతున్న సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టా ఆంజనేయులు

వనపర్తిటౌన్: ప్రభుత్వాలు మారుతున్నా.. పుర కార్మికుల కష్టాలు మాత్రం తీరడం లేదని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి పుట్టా ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కార్మికులతో కలిసి జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలానే ఈ సర్కార్ కూడా కార్మికులకు నష్టం వాటిల్లే కొత్త నిబంధనలు తీసుకొస్తుందని, దీంతో కార్మికులు ఇబ్బందులపాలవుతారని మండిపడ్డారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. నీటి సరఫరా కార్మికులకు వారాంతపు సెలవు ఇవ్వాలని, రోజుకు ఎనిమిది గంటల పని చేయించాలన్నారు. రూ.25 లక్షల ప్రమాదబీమా పథకాన్ని అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. ఈ నెల 19న నిర్వహించే చలో సీడీఎంఏ కార్యక్రమానికి కార్మికులు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రయ్య, వాటర్ వర్కర్స్ కార్యదర్శి శాంతయ్య, కోశాధికారి సురేందర్, నాయకులు నరేష్‌గౌడ్, పరమేశ్వర్, మూర్తి, వసంత్, గోవింద్, ఎస్.కృష్ణయ్య, సాగర్, జయరాజు, రమేష్, రాము, నరేష్ తదితరులు పాల్గొన్నారు.